

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# మేడిగడ్డపై రేవంత్ రాజకీయం

**రాజకీయ లబ్ధి కోసమే సీఎం టూర్**


- సీబీఐ విచారణపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే మూసీ నదిలో వేసినట్లే
- దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 40సీట్లు కూడా రావు
- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

వరంగల్, ఫిబ్రవరి 13 : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ లబ్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డకు వెళ్లి రాజకీయం చేస్తున్నారని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం వరంగల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేడిగడ్డ డ్యామేజ్ వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్నదని మండిపడ్డారు. ఇదివరకే రాహుల్‌గాంధీతో కలిసి మేడిగడ్డకు వెళ్లిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మళ్లీ ఎందుకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాక ముందు కాళేశ్వరం అవినీతి, మేడిగడ్డ డ్యామేజీపై సీబీఐ విచారణ జరిపిస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. సమగ్ర విచారణ జరిపించే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. మేడిగడ్డ డ్యామ్ ప్రమాదంలో ఉందని తెలిసినా అధికారంలోకి వచ్చిన రెండు నెలల కాలం వృథా చేశారన్నారు. డ్యామ్ సేఫ్టీ అథారిటీ అడిగిన వివరాలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని, నిపుణుల కమిటీ బృందం మళ్లీ మేడిగడ్డ సందర్శనకు వస్తామంటే అనుమతి ఇవ్వకుండా అడ్డుకుంటున్నదని విమర్శించారు. విజిలెన్స్ దర్యాప్తు అంటున్న రాష్ట్ర సర్కారు విజిలెన్స్ ఏం చేస్తుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రాజెక్టులపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోందని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆంధ్రా పోలీసుల పహారాలో కృష్ణా జలాలను తీసుకుపోతుంటే రెండు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవహారంపై రాష్ట్ర సర్కారు వైఖరి ఏమిటో తెలుపాలని, సమస్యను ఎలా పరిష్కరించుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలు పరిష్కరించుకుంటే కేంద్రం జోక్యం చేసుకోదని, లేకుంటే పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంటుందని స్పష్టం చేశారు. కృష్ణా జలాల వివాదంపై కేంద్రం కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ ఏర్పాటుచేసిందన్నారు. ఇరు రాష్ట్రాలు ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించి న్యాయం పొందవచ్చన్నారు. కేంద్రంపై నిందలు వేస్తూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్ స్థానాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 40 సీట్లు రావని ఆయన జోస్యం చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మూసీ నదిలో వేసినట్లేనని, రాహుల్ గాంధీని నమ్మితే కుక్కతోక పట్టి గోదారి ఈదినట్లేనని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతో బీజేపీ ఎప్పుడూ కలువలేదని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంటా రవికుమార్, రాష్ట్ర నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, తాళ్లపెల్లి కుమారస్వామి, డాక్టర్ విజయరామారావు, డాక్టర్ రాజేశ్వర్‌రావు, డాక్టర్ కాళీప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మార్తినేని ధర్మారావు, ఓంటేరు జయపాల్, సతీశ్, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

# వైభవంగా వేయిస్తంభాల మండపం నిర్మాణం

- ఈ నెల చివరి వారంలో ప్రారంభిస్తాం
- త్వరలో గిరిజన యూనివర్సిటీని ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- కేంద్ర పర్యాటక, పురావస్తు శాఖల మంత్రి కిషన్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 13 : చారిత్రక వేయి స్తంభాల ఆలయ కల్యాణ మండపాన్ని వైభవంగా నిర్మిస్తున్నామని ఈ నెల చివరి వారంలో ప్రారంభిస్తామని కేంద్ర పర్యాటక పురావస్తు శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన ఆలయాన్ని, మండపాన్ని పరిశీలించి స్థపతి శివకుమార్, పురావస్తు శాఖ సూపరింటెండెంట్ స్మిత ఎస్‌కుమార్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాధికాగుప్తా, జిల్లా అధికారి మల్లేశంతో కలిసి చర్చించారు. మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాశీ, అయోధ్య రామాలయం, కేథార్‌నాథ్, బద్రీనాథ్, ఓం కారేశ్వర్, సోమనాథ్ ఆలయం, రామప్ప ఆలయాన్ని యునెస్కోలో చేర్చే అవకాశం కలిగిందన్నారు. రామప్ప ఆలయాన్ని రూ.60 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, ఖిలా వరంగల్ కోటలో రూ.3 కోట్లతో సౌండ్ అండ్ లైట్స్‌తో ఆధునీకరిస్తున్నామని చెప్పారు. ట్రైబల్ సర్క్యూట్ పేరుతో పరిసర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో గెస్ట్‌హౌస్‌లు, బోట్లు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందించామన్నారు. ములుగులో సమ్మక్క-సారలమ్మ గిరిజన యూనివర్సిటీ మంజూరు చేశామని, త్వరలోనే ప్రధాని మోదీ ప్రారంభిస్తారని చెప్పారు. తాత్కాలికంగా విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి ఈ సంవత్సరం కోర్సులను ప్రారంభిస్తామన్నారు. మేడారం జాతరలో ట్రైబల్ స్టాల్స్ ఏర్పాటు చేశామని, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం రోడ్డును వెడల్పు చేసి పార్కింగ్, టూరిజం గెస్ట్‌హౌస్ నిర్మించాలని పలు రాజకీయ పార్టీల నాయకులు కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. అంతకుముందు కల్యాణ మంటప విశేషాల ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. వారి వెంట మార్తినేని ధర్మారావు, రావు పద్మ, మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, కొండేటి శ్రీధర్, ఘంటా రవికుమార్, విజయ్, చంద్రారెడ్డి, చాడ శ్రీనివాస్‌రెడ్డి, గండ్రాతి రాజు ఉన్నారు. వైదిక కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, మణికంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌లు నిర్వహించారు.



మేడిగడ్డ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

# హంగామా చేసి.. దాటవేసి..

**మేడిగడ్డలో కాంగ్రెస్ సర్కారు మెగా షో**

- లక్ష్మీబరాజ్‌ను పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు
- మరోమారు పవర్‌పాయింట్ ప్రజంటేషన్
- కార్యక్రమానికి ముగ్గురు మంత్రులు డుమ్మా
- నల్లగొండలో కేసీఆర్ ప్రసంగం కోసం సీఎం వెయిటింగ్
- ప్రాజెక్టుపై నిర్ణయం మళ్లీ పెండింగ్

*వచ్చారు.. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.. కానీ, ఏం చేస్తారో తేల్చకుండానే వెళ్లారు.. ఇదీ మేడిగడ్డ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల బృందం తీరు.. జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డలో లక్ష్మీబరాజ్‌ను సీఎంతో పాటు మంత్రులు పరిశీలించడం, ప్రాజెక్టుపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు వారు ఇచ్చిన సమాధానాలు చూస్తే 'కొండను తవ్వి ఎలుకను పట్టిన' చందాన్ని తలపించింది. మొత్తంగా మేడిగడ్డ వద్ద మంగళవారం కాంగ్రెస్ సర్కారు నిర్వహించిన కార్యక్రమమంతా మహా హంగామాలా కొనసాగింది.*

*- జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ)/మహదేవ్‌పూర్/కాళేశ్వరం*

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు మేడిగడ్డ బరాజ్ వద్దకు మంగళవారం మధ్యాహ్నం 3.40 గంటలకు చేరుకొని కుంగిన పిల్లర్లను పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి బరాజ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమం వద్దకు 4.35 గంటలకు వచ్చారు. ఎమ్మెల్యేలు, మంత్రులు వేదికపైకి రాగా సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తన వాహనంలో వెళ్లారు. నల్లగొండలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగం కోసం ఎదురుచూసిన అనంతరం రేవంత్‌రెడ్డి తిరిగి 5.04గంటలకు వేదికపైకి చేరుకున్నారు. వేదికపై కేవలం మంత్రులకు మాత్రమే కుర్చీలు వేయగా ఎమ్మెల్యేలు కూడా అక్కడికే వచ్చారు. ఈ క్రమంలో కొంతసేపు ఎమ్మెల్యేలు కుర్చీల్లేక అయోమయానికి గురయ్యారు. దీంతో కలెక్టర్ భవేశ్ మిశ్రా మరి కొన్ని కుర్చీలు తెప్పించి ఎమ్మెల్యేలను వేదికపై కూర్చోబెట్టారు. ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు గురించి పూర్తి స్థాయిలో సమావేశం నిర్వహించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ విన్నారు. కాగా తాజాగా మరోమారు సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జి ఈఎన్సీ సుధాకర్‌రెడ్డితో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇప్పించారు. విజిలెన్స్ డీజీ రాజీవ్ రంజన్ బరాజ్ పరిస్థితిపై విచారణకు సంబంధించి ప్రజంటేషన్ ఇచ్చారు. అయితే అవినీతి అక్రమాలపై కాకుండా బరాజ్‌లోని టెక్నికల్ విషయాలపై విజిలెన్స్ డీజీ రంజన్ ఓ ఇంజినీర్‌లా స్క్రీన్‌పై ప్రజంటేషన్ ఇవ్వడంపై ఇంజినీర్లు అసహనానికి గురయ్యారు. సుమారు రాత్రి 7 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగగా మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డుమ్మా కొట్టారు. సమావేశానికి హాజరైన మహదేవ్‌పూర్ ఎంపీపీ రాణీబాయి, జడ్పీటీసీ అరుణను పోలీసులు వేదిక వైపు కుర్చీల్లోకి అనుమతించలేదు. దీంతో వారు పోలీసులు, అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయినా అనుమతించకపోయేసరికి ప్రెస్‌గ్యాలరీలో కూర్చున్నారు. సమావేశం ఆద్యంతం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే కోణంలోనే సీఎం అధికారులతో అడిగి మరీ సమాధానాలు చెప్పించుకున్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా చివరికి ఎటూ తేల్చకుండా వెళ్లిపోయారు. బరాజ్‌ను రిపేరు చేయిస్తారా.. మొత్తానికే వదిలేస్తారా.. అసలు టెక్నికల్ విచారణ ఎందుకు ప్రారంభం కావడం లేదు.. ఎల్‌అండ్‌టీతో పనులు చేయిస్తారా.. వర్షాకాలం రాబోతున్నది.. బరాజ్ పరిస్థితి ఏమిటి అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. 'ఎన్డీఎస్ఏ విచారణ అనంతరం నిర్ణయం తీసుకుంటాం.. అవసరమైతే తుమ్మిడిహట్టి నిర్మిస్తాం' అంటూ దాటవేస్తూ వెళ్లిపోయారు.



బరాజ్‌ను పరిశీలిస్తున్న సీఎం, మంత్రులు




గట్టమ్మ దేవాలయం

# నేడు గట్టమ్మ ఎదురుపిల్ల పండుగ

**101 బోనాలతో బైలెల్లనున్న ఆదివాసీ నాయక్‌పోడ్‌లు**

**30 లక్ష్మీదేవరలతో గట్టమ్మ వరకు భారీ ర్యాలీ**

ములుగురూరల్, ఫిబ్రవరి 13 : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా దేశ నలుమూల నుంచి వనదేవతలను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి హాని కలుగకుండా గట్టమ్మ తల్లికి నేడు ఆదివాసీ నాయక్‌పోడ్‌లు ఎదురుపిల్ల పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30 లక్ష్మీదేవరలు నేడు ములుగు గట్టమ్మ తల్లి వద్దకు చేరుకోనున్నాయి. బుధవారం ఉదయం ఆదివాసీ నాయక్‌పోడ్ పూజారులు, వారి కుటుంబ సభ్యులు ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి తోరణాలు, బంతి పూలతో అలంకరించనున్నారు. అనంతరం ఆలయం సమీపంలో ఉన్న గుట్ట నుంచి కంకవనాన్ని తీసుకొచ్చి గట్టమ్మ ఆలయం ఎదుట, ఆలయ ఆవరణలో ఉన్న సమ్మక్క-సారలమ్మ గద్దెలపై అమర్చనున్నారు. అనంతరం ఇండ్లకు చేరుకొని ఆదిదే వతకు బెల్లం అన్నంతో వండిన 101 బోనాలతో ములుగులోని ఆదివాసీ నాయక్‌పోడ్ కమ్యూనిటీ హాల్ వద్దకు చేరుకుంటారు. ఐదు లక్ష్మీదేవరలను తీసుకొచ్చి కుల పెద్దమనిషి, ఆలయ ప్రధాన పూజారి కొత్త సదయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన లక్ష్మీదేవరలకు చీరె, సారె, పోకవక్క, గాజులు, పసుపు, కుంకుమ, తమలపాకు, సోడు బియ్యం సమర్పిస్తారు. అనంతరం వెయ్యి నుంచి 2వేల మంది ఆదివాసీ నాయక్‌పోడ్‌లు వారి ఆచార, సంస్కృతి, సంప్రదాయాల నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న గట్టమ్మ వద్దకు చేరుకోనున్నారు. బోనాలతో ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం గొర్రె పిల్లను ఎదురుపిల్లగా గట్టమ్మ తల్లికి బలి ఇవ్వనున్నారు.

**భక్తులకు రక్షణగా నిలిచే తల్లి గట్టమ్మ**



జాతరకు వచ్చే భక్తులు ఇబ్బంది లేకుండా అమ్మవార్లను దర్శించుకొని ఇండ్లకు చేరే వరకు గట్టమ్మ తల్లి వారి ప్రయాణంలో అండగా ఉంటుంది. భక్తులకు ఎలాంటి ఆపద రాకుండా ఆదివాసీ నాయక్‌పోడ్‌ల ఆచార, సంప్రదాయాల ప్రకారం గట్టమ్మకు ఎదురు పిల్ల పండుగ నిర్వహిస్తాం. ప్రజలు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి గట్టమ్మ తల్లి ఆశీస్సులు పొందాలి.

– కొత్త సురేందర్, పూజారి, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు

# భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- ప్రమాద ప్రదేశాల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

తాడ్వాయి, ఫిబ్రవరి13 : మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మేడారంలోని హరిత హోటల్‌లో మంగళవారం గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్‌కుమార్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్‌తో కలిసి పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగితెలుసుకున్నారు. ఇంకా పనులు పూర్తి కానివి ఉన్నాయా? అని ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇదే ఆఖరి సమావేశం అని భక్తులకు సేవలందించేందుకు అధికారులు సిద్ధం కావాలని సూచించారు. గతంలో కంటే ఎక్కువగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఏవైనా సమస్యలు తలెత్తితే మిగితా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని జాతర విజయవంతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. రహదారుల వెంట భక్తుల వాహనాలు ప్రమాదాల బారిన పడకుండా హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేయాలన్నారు. అంతేకాకుండా జంపన్నవాగులో ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్టాళ్ల వద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రపంచానికి తెలిసేలా జాతరలో ఏర్పాట్లు ఉండాలన్నారు. తాగునీరు, టాయిలెట్లు, ఫ్లడ్‌లైట్లు తదితర అన్ని ఏర్పాట్లు కల్పించాలని, కల్యాణకట్టలో భక్తుల నుంచి అధిక వసూళ్లకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్‌కుమార్ మాట్లాడుతూ చిలుకలగుట్ట, జంపన్నవాగు, గద్దెల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికి కేటాయించిన ప్రదేశంలో వారే ఉండేలా జోనల్ సెక్టోరల్, జోనల్ అధికారులు చూడాలని ఆదేశించారు. జాతర ప్రతిష్టకు భంగం కలుగకుండా ప్రతి అధికారి సహకరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలోఅదనపు కలెక్టర్ శ్రీజ, ఏఎస్పీ సంకీర్త్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, దేవాదాయశాఖ అధికారి రాజేంద్రం పాల్గొన్నారు.




సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

# ఆడవేషంలో జీపీ కార్యదర్శి

**ప్రాంక్ చేయబోయి పట్టుబడిన వేణుగోపాల్**

ములుగు రూరల్, ఫిబ్రవరి 13: ములుగు జిల్లా కేంద్రంలో పలు వీధుల్లో ఆడవేషంలో జీపీ కార్యదర్శి తిరుగుతూ అడ్డంగా దొరికిపోయాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై వెంకటేశ్వర్ కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గుమ్మలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి బీ వేణుగోపాల్ ఆడవేషంలో ములుగుకు వచ్చాడన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన వద్ద పలువురిని ఆడవేషంలో ప్రాంక్ చేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో స్థానికులు ఆడవేషంలో ఉన్నది మగ వ్యక్తి అని గుర్తించి, ఇటీవల చిన్న పిల్లలను కిడ్నాప్ చేసే ముఠాగా భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా గుమ్మడపల్లి జీపీ కార్యదర్శి వేణుగోపాల్‌గా తేలిందన్నారు. వృత్తి రీత్యా కార్యదర్శిగా పనిచేస్తూ అప్పుడప్పుడు ఆడ వేషంలో ప్రాంక్ చేయడం సరదాగా మార్చుకున్నాడని తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకున్న అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఇలా చేయడమేమిటని మందలించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్సై చెప్పారు.



ఆడవేషంలో ఉన్న వేణుగోపాల్

# మంత్రాల నెపంతో..

- పట్టపగలే నడిరోడ్డుపై తల్లి, కొడుకు దారుణ హత్య
- నిందితుడిని పోలీసులకు పట్టించిన స్థానికులు
- మహబూబాబాద్ జిల్లా గూడూరులో ఘటన



నిందితుడు కుమారస్వామి



మృతులు ఆలకుంట సమ్మక్క, సమ్మయ్య (ఫైల్)

గూడూరు, ఫిబ్రవరి13 : పట్టపగలే నడిరోడ్డుపై తల్లీకొడుకు దారుణ హత్యకు గురయ్యారు. మంత్రాల నెపంతో మహబూబాబాద్ జిల్లా గూడూరులోని ప్రధాన సెంటర్‌లో ఇద్దరిపై ఇనుపరాడ్‌తో విచక్షణారహితంగా దాడి చేసి చంపడం సంచలనం రేపింది. వివరాలిలా ఉన్నాయి. గూడూరు మండలం బొల్లేపల్లికి చెందిన ఆలకుంట సమ్మక్క(60), కొమురయ్య దంపతులు, కొడుకు ఆలకుంట సమ్మయ్య(40)పై మంత్రాలు చేస్తున్నారనే నెపంతో అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ శివరాత్రి కుమారస్వామి కక్ష పెంచుకున్నాడు. వీరికి కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై గతంలో కొమురయ్య, సమ్మయ్యపై కుమారస్వామి దాడి చేశాడు. దీంతో సమ్మయ్య వరంగల్‌లో ఉంటూ ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. కుమారస్వామి కూడా గూడూరులో ఆటో నడుపుకొంటున్నాడు. అయితే, తన కూతురి నిశ్చితార్థం ఉందని సమ్మయ్య కుటుంబంతో కలిసి ఐదు రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. శనివారం గూడూరులో సమ్మయ్య ఆటోకు అడ్డు తగిలి తనపై మీ కుటుంబం మంత్రాలు చేస్తున్నదని ఆరోపిస్తూ కుమారస్వామి దాడి కి యత్నించాడు. దీంతో అదేరోజు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం నిశ్చితార్థం అయిపోవడంతో మంగళవారం తమ ఫిర్యాదు గురించి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆటోలో తిరిగి ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో గూడూరు అంబేద్కర్ సెంటర్ ప్రాంతంలో కుమారస్వామి తన ఆటోతో అడ్డు తగిలి ఇనుప రాడ్‌తో వారిపై విచక్షణారహితంగా దాడి చేయడంతో తల్లి ఆలకుంట సమ్మక్క, కొడుకు సమ్మయ్య అక్కడికక్కడే మృతిచెందారు. కొమురయ్యకు చెయ్యి విరుగగా, సమ్మయ్య భార్య రజితకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. సీఐ ఫణీధర్, ఎస్సైలు రాణాప్రతాప్, నగేశ్, దిలీప్, ప్రవళిక చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. గాయపడిన కొమురయ్యను మహబూబాబాద్ దవాఖానకు తరలించారు. భార్య రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా ఉన్మాదిలా దాడి చేసి హత్య చేసి పారిపోతుండగా కుమారస్వామిని స్థానిక యువకులు ధైర్యం చేసి పట్టుకుని స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితుడిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. న్యాయం చేయాలని స్టేషన్ వద్ద బంధువులు ఆందోళన చేశారు.

# రేపు మేడారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

**హాజరుకానున్న మంత్రులు సురేఖ, సీతక్క**

తాడ్వాయి, ఫిబ్రవరి 13 : మేడారం మహా జాతరలో ముఖ్య భూమిక పోషించే ట్రస్ట్‌బోర్డు కమిటీ రేపు కొలువుదీరనుంది. ఇప్పటికే చైర్మన్‌తో పాటు 13 మందిని డైరెక్టర్లుగా మంత్రి సీతక్క ఖరారు చేయగా దేవాదాయశాఖ అధికారులు ఆమోదం తెలిపారు. దీంతో గురువారం చైర్మన్, డైరెక్టర్లు సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణంలో ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ సీతక్క ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వీరి సమక్షంలో చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్లుగా 12మంది సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈమేరకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.



ప్రమాణ స్వీకారం చేయనున్న చైర్మన్, కమిటీ సభ్యులు